నెరవేరిన దశాబ్దాల కల

- రూ. 33.50 లక్షలతో వంతెన, అప్రోచ్ రోడ్ నిర్మాణం
- రోడ్ కనెక్టవిటీతో 2 వేల కుటుంబాలకు ప్రయోజనం
- హర్షం వ్యక్తం చేస్తున్న శ్రీనివాసనగర్ ప్రజలు





శ్రీనివాసనగర్‌లో వంతెన ప్రారంభోత్సవంలో పాల్గొన్న మేయర్ హరి వెంకట కుమారి, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, డిప్యూటీ మేయర్ సతీష్, కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట: దశాబ్దాల కల నెరవేరింది. ప్రజల చిరకాల సమస్య పరిష్కారమైంది. ఉత్తర నియోజకవర్గం జీవీఎంసీ 43వ వార్డు శ్రీనివాసనగర్‌లో గెడ్డపై రూ.33.50 లక్షల వ్యయంతో నిర్మించిన కొత్త వంతెన నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీలతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ హరి వెంకట కుమారి మాట్లాడుతూ నగర ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే ప్రథమ కర్తవ్యమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో విశాఖను ఆకర్షణీయమైన నగరంగా తీర్చిదిద్దడం జరుగుతోందన్నారు. నగరంలోని అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రెయిన్లు, వీధి దీపాల నిర్వహణ, పారిశుధ్య నిర్వహణ, తాగునీరు, పార్కుల అభివృద్ధితోపాటు మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు తెలిపారు.

2వేల మందికి ప్రయోజనం

ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు మాట్లాడుతూ శ్రీనివాసనగర్ గెడ్డపై రూ. 33.50 లక్షలతో కొత్త వంతెన, అప్రోచ్ రోడ్ నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజల చిరకాల సమస్య పరిష్కారమైందన్నారు. కొత్త వంతెన నిర్మాణంతో సుమారు రెండు వేల కుటుంబాలకు రోడ్ కనెక్టవిటీతో ప్రయోజనం కలిగిందన్నారు. గతంలో ఇరుకైన వంతెన ఉండటంతో అత్యవసర సమయాల్లో అంబులెన్స్, కారు వచ్చే మార్గం లేక చుట్టూ తిరిగి 80 అడుగుల రోడ్‌కు చేరుకోవాల్సి వచ్చేదన్నారు. వార్డు కార్పొరేటర్ ఉషశ్రీ చొరవతో ప్రజల కోరిక మేరకు విశాలమైన వంతెన నిర్మాణంతో 100 అడుగుల దూరంతో 80 అడుగుల రోడ్డుకు చేరుకునే అవకాశం ఏర్పడిందన్నారు.

ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఉత్తర నియోజకవర్గంలో సుమారు రూ.315 కోట్ల వ్యయంతో 17 వార్డుల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. కార్పొరేటర్ ఉషశ్రీ మాట్లాడుతూ గతంలో ఉన్న ఇరుకైన బ్రిడ్జి స్థానంలో 16 అడుగుల వెడల్పుతో కొత్త బ్రిడ్జి నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ప్రజల కోసం పట్టుబట్టి నిధులు మంజూరు చేయించి వంతెన నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బైర వెంకట్, సతీష్, ఆడారి పారుపల్లి రవి, పి.ఎస్.నాయుడు, మౌనికరెడ్డి, తిరుపతి, ఎం.గోపి, యన్.కుమార్, నరసింగరావు, చంద్రకళ, వల్లి, బంగారమ్మ, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

14 ఏళ్లగా ఎదురుచూపు



తామంతా14 ఏళ్లుగా త్రిశూల్ అపార్టుమెంట్‌లో ఉంటున్నాం. ఇరుకైన వంతెనతో ఇబ్బంది పడుతున్నాం. మా ప్రాంతానికి కారు వెళ్లే విధంగా రోడ్డు కనెక్టవిటీ ఇవ్వాలని చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నాం. గతంలో ఎంతో మంది ప్రజాప్రతినిధులు వచ్చి చూసి వెళ్లారు గాని సమస్య పరిష్కరించలేదు. కార్పొరేటర్ ఉషశ్రీ ఇచ్చిన హామీ మేరకు కొత్త బ్రిడ్జి నిర్మించి మా కాలనీ చిరకాల సమస్య పరిష్కరించారు.

– ఐ.మోహిని రాణి, త్రిశూల్ అపార్టుమెంట్, శ్రీనివాసనగర్

రోడ్ కనెక్టవిటీ ఏర్పడింది



సాయికృష్ణా అపార్టుమెంట్‌లో పదేళ్లగా నివసిస్తున్నాం. శ్రీనివాసనగర్‌లో సుమారు రెండువేల కుటుంబాలు ఉంటున్నాయి. మెడికల్ ఎమర్జెన్సీ అయితే చుట్టూ తిరిగి 80 అడుగుల రోడ్‌కు చేరుకోవాలి. గెడ్డపై కొత్త బ్రిడ్జి నిర్మాణంలో మా కాలనీకి అంబులెన్స్, కార్లు రాకపోకలు సాగించే వీలు కలిగింది. కేవలం 100 మీటర్లు ప్రయాణిస్తే చాలు 80 అడుగుల రోడ్‌కు చేరుకోవచ్చు. చాలా సంతోషంగా ఉంది.

– ఓ.రాజేశ్వరి, సాయికృష్ణా అపార్టుమెంట్, శ్రీనివాసనగర్

చాలా సంతోషంగా ఉంది



రోడ్ కనెక్టవిటీ కోసం శ్రీనివాసనగర్ ప్రజలకు దశాబ్దాల కాలంగా పోరాడుతున్నారు. గతంలో ప్రజా ప్రతినిధులు వచ్చి వెళ్లారు. సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ కార్యరూపం దాల్చలేదు. వార్డు కార్పొరేటర్ ఉషశ్రీ కృషి, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఈ ప్రాంత ప్రజల సహకారంతో దశాబ్దాల కల నెరవేరింది. కొత్త బ్రిడ్జి, అప్రోచ్‌రోడ్ నిర్మించారు. దీని కోసం 10 అడుగుల వెడల్పు, 57 అడుగుల పొడవు గల సుమారు 63 గజాలు ప్రైవేటు సైటు జీవీఎంసీ కొనుగోలు చెయ్యడం విశేషం.

– రాజగిరి సింహాచలం, మాదేటి గార్డెన్స్

ముఖ్యమంత్రి సభకు తరలి రావాలి



మాట్లాడుతున్న రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: భీమిలి నియోజకవర్గం సంగివలసలో శుక్రవారం జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు అందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు 288 మహత్‌ాలనీ సచివాలయంలో పార్టీ నాయకులు, గృహసారథులు, కార్యకర్తలతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సచివాలయ కన్వీనర్లు, బి.తిరుమలరావు, మెట్ట దమయంతి, కరిమిరెడ్డి శ్యామ్, లత పాల్గొన్నారు.

బహిరంగ సభకు సిద్ధంకావాలి

తాటిచెట్లపాలెం: భీమిలి శనివారం జరగనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు అందరూ సిద్ధం కావాలని జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, వార్డు కార్పొరేటర్ కంపా హనోకు పిలుపునిచ్చారు. పార్టీ ముఖ్యనాయకులు, సచివాలయ కన్వీనర్స్, ఆయా అనుబంధ సంఘాల నాయకులతో గురువారం తాటిచెట్లపాలెంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వార్డు అధ్యక్షుడు పైడిరమణ, పార్టీ నాయకులు హరిపట్నాయక్, రాజు యాదవ్, నాని బాబు, దుర్గ, సన్నిబాబు, నాయుడు, మాతా ఈశ్వర్, గణపతి, బాబూరావు, శ్యామ్ సచివాలయ సిబ్బంది, సిఓలు, ఆర్పీలు, ఆశవర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కంపా హనోకు

క్లుప్తంగా

తాగునీటి బోరు ప్రారంభం

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులోని మంచినీటి బోరును కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ప్రారంభించారు. వెంకటేశ్వరస్వామి ఆలయం వెనుక ఆనుకుని ఉన్న దోబీఘాట్ అభివృద్ధి పనుల్లో భాగంగా గురువారం ఆయన చేతులమీదుగా కొబ్బరికాయకొట్టి బోరును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం ప్రెసిడెంట్, సెక్రటరీలు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్,కరిమిరెడ్డి శ్యామ్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



లావణ్య (ఫైల్)

మద్రిపాలెం: ఓ వివాహిత అదృశ్యమైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాలిలా...లావణ్య అనే మహిళ భర్త ,ఇద్దరు పిల్లలతో కలిసి కంచరపాలెం సూర్యనగర్‌లో నివసిస్తున్నారు. సదరు వివాహిత మాట్లాడలేదు, ఆమెకు వినబడదుకూడా..(చెవిటి,మూగ). ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో ఈ నెల 24న ఉదయం 8.30 గంటల సమయంలో ఆమె ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో అంతటా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆమె తల్లి ధనాల రాజులమ్మ ఫిఫ్త్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్ భాస్కరరావు నేతృత్వంలో ఏఎస్‌ఐ రాజారావు కేసు దర్యాప్తు చేపట్టారు.

బైకు చోరీపై ఫిర్యాదు

మద్రిపాలెం: కంచరపాలెం పరిధిలో బైకు చోరీకి గురైందని ఓ వ్యక్తి ఫిఫ్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. క్రైం పోలీసుల వివరాలిలా ఉన్నాయి. లోలా ఆనందరావు ఈ నెల 11న రాత్రి 9 గంటల సమయంలో మురళీనగర్ దరి ఎన్‌జీఓస్‌కాలనీలో టిఫిన్ కోసం వచ్చి బైకు రోడ్డు పక్కన పార్క్‌చేసి తాళాలు వాహనానికే వదిలేశాడు. టిఫిన్ కట్టించుకుని వచ్చి చూసేసరికి బైకు కనిపించలేదు. పది రోజులు దాటిన తరువాత కంచరపాలెం క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైం ఎస్‌ఐ సునీల్ దర్యాప్తు చేస్తున్నారు.

వార్డులో కార్పొరేటర్ పర్యటన



మాట్లాడుతున్న కార్పొరేటర్ ప్రసాద్

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డులోని కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ పర్యటించారు. గురువారం సింగరాయమెట్ట బాలయోగి గుడి ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. రోడ్ల నిర్మాణం జరుగుతున్న క్రమంలో అక్కడ వాటర్ సప్లైకి సంబంధించిన పైప్‌లు అడ్డంగా ఉన్నాయని స్థానికులు చెప్పడంతో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా వాటిని అక్కడ నుంచి తొలగించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బుజ్జి, చిన్నారావు, దిలీప్, ఈశ్వర్‌రావు, కె.బుజ్జి, ఏవీఎస్ రాజు, కృష్ణనాయుడు, వాటర్ సప్లై ఏఈ ఇమాన్యుయల్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, కాళిదాస్, శ్యామ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై కమిషనర్‌కు వినతి



జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మని కలిసి వినతిపత్రం అందిస్తున్న కేకేరాజు, కార్పొరేటర్లు

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించి కార్పొరేటర్లతో కలిసి వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకేరాజు.. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటి హాలు, రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు, వీధి లైట్లు, కొండవాలు ప్రాంతాల్లో మెట్ల మార్గాలు, రక్షణ గోడలు నిర్మాణంపై చర్చించామన్నారు. వేగవంతంగా పనులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్,మండల పార్టీ అధ్యక్షుడు కటుమూరి సతీష్, మండలపార్టీ అధ్యక్షుడు, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోక్, మండల పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, సారిపల్లి గోవింద్, పి.ఉషశ్రీ, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, శశికళ, కో–ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మద్రిపాలెం: రెండు రోజుల క్రితం కంచరపాలెం పరిధిలో పైలా రాజు మద్యం మత్తులో టిన్నర్ ఆయిల్ తలపై పోసుకుని నిప్పంటుచుకుని గాయపడిన విషయం తెలిసిందే. గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కంచరపాలెం తిక్కవానిపాలెంలో భార్య, ఇద్దరి పిల్లలతో కలిసి నివసిస్తున్న పైలా రాజు (44) పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. అతడికి మద్యం సేవించే అలవాటు ఉంది. ఈ క్రమంలోనే ఈ నెల 22 రాత్రి పూటుగా మద్యం తాగి తలపై టిన్నర్ ఆయిల్ వేసుకుని కాలుతుందో లేదోనని నిప్పంటించుకున్నాడు. వెంటనే అతని భార్య, చుట్టుపక్కనవారి సాయంతో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని ఫిఫ్త్‌టైన్ పోలీసులు తెలిపారు.

విలువల నిలయం జనకులం



అధ్యాపకులతో పూర్వ విద్యార్థుల బృందం

తాటిచెట్లపాలెం: ఆధునిక విద్యాబోధనతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదా యాలను, నైతిక విలువలను విద్యార్థి దశలోనే నేర్పించే విలువలతో కూడిన నిలయం జనకులం అని జగద్గురుపీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ తెలిపారు. తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఈకే సంస్కృతి సదన్‌లో గురువారం జనకులం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యదేవ్ మాట్లాడుతూ జనకులంలో అనేకమంది ఉన్నత విలువలతో కూడిన విద్యతోపాటు సామాజిక సేవల్లో కూడా పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న మరో ముఖ్య అతిథి జగద్గురుపీఠం సలహా మండలి సభ్యులు సీహెచ్ఎస్ఎన్ రాజు మాట్లాడుతూ దేశరక్షణలో యోధులు, కర్షకులు, ఉపాధ్యాయుల పాత్ర విశిష్టమైనదని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న జనకులం పూర్వ విద్యార్థి డాక్టర్ గూటాల వెంకటరమణ (న్యూయార్క్) మాట్లాడుతూ మానవతా విలువలను, సంప్రదాయ విశిష్టతను అమెరికాలో చిన్న పిల్లలకు బోధిస్తుంటానన్నారు. పూర్వ విద్యార్థులు ఇంద్రగంటి కాశీప్రసాద్, గొల్లపూడి రవికుమార్, మాస్టర్ ఈకే మార్గంలో తమ అనుభవాలను వివరించారు. ఈ సందర్భంగా జనకులంలో పూర్వ విద్యార్థుల బృందం పూర్వ అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జగద్గురుపీఠం కార్యదర్శి బీఆర్‌కే రాజు, పి.కృష్ణమోహన్, పి.లక్ష్మీదేవి, ఎక్కిరాల సుదర్శనం, బాలబాను విద్యాలయం ప్రిన్సిపల్ యస్.వి.శుభశ్రీ, జగద్గురుపీఠం కార్యనిర్వాహక సభ్యురాలు బి.ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్రా పోటీలు



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన సుబ్బలక్ష్మీనగర్ సచివాలయం టీం

తాటిచెట్లపాలెం: ఉత్తర నియోజకవర్గం పరిధి కైలాసపురం దరి డీఎల్‌బీ గ్రౌండ్స్‌లో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. సుబ్బలక్ష్మీనగర్ టీం మండలస్థాయి పోటీలో విజేతగా నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైంది.కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అఖిల, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డీఈ భరణి, కార్పొరేటర్లు ఉషశ్రీ, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, చల్లా రజని ఈశ్వర్రావు, కేవీఎస్ శశికళ, కో ఆప్షన్ సభ్యులు సేనాపతి అపాపరావు, బులుసు జగదీష్, నీలిరవి, పైడిరమణ, కిరణ్ రాజు, రాయుడు శ్రీను, నూకరాజు, అంబటి శైలేష్, వసంతల అప్పారవు, హరి పట్నాయక్, బోడ్డేటి కిరణ్, కె చిన్నా, గంగామహేష్, ఐ రవికుమార్, ఎం సునీల్, గాలి ప్రసాద్, కృపా తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

మురళీనగర్: మానవసేవే మాధవ సేవ అసోసియేషన్ ఆధ్వర్యంలో మురళీనగర్‌లో గురువారం సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీనగర్ శ్రీదేవి పార్కులో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలతోపాటు అంగవైకల్యంతో బాధపడుతున్న నలుగురి కుటుంబాలకు నిత్యావసర సరకులను అందించారు. కార్యక్రమంలో మానవసేవే మాధవ సేవ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల భాను ప్రకాష్, గౌరవాధ్యక్షుడు డి.ప్రసాదరాజు, ఉపాధ్యక్షుడు డి.వరప్రసాద్ పాల్గొన్నారు.

అన్నదానం

సీతమ్మధార : పౌర్ణమి సందర్భంగా నక్కవానిపాలెంలోని శ్రీ ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు. ఆలయ ట్రస్టీ చైర్మన్ నక్క అప్పలరెడ్డి, ధర్మకర్త అప్పల నర్సమ్మ పాల్గొన్నారు.

బస్ బే ప్రారంభం



బస్‌బే ప్రారంభోత్సవంలో కేకేరాజు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 24 వార్డులోని సీఎంఆర్ దరి (రేసపువానిపాలెం)లో నూతన బస్ బేని కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త కేకేరాజు ప్రారంభించారు. రూ.20 లక్షలతో దీనిని అందుబాటులోకి తెచ్చినట్టు కేకే రాజు చెప్పారు. ప్రయాణికులకు అన్ని సౌకర్యాలతో కూడిన బస్‌బే ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. మరుగుదొడ్లు సౌకర్యం కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, 14 వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, జోన్–3, కమిషనర్ విజయలక్ష్మి, గుడ్ల అశోక్‌రెడ్డి, ఈఈ రత్నాకర్ రెడ్డి, ఏఈ, శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షులు జి.వి.రమణి, జేసీఏ మండల ఇన్ చార్జు మురళీకృష్ణారెడ్డి, దల్లి రామకృష్ణారెడ్డి, 24 వార్డు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు సద్వినియోగం చేసుకుందాం



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏపీఈపీడీసీఎల్ సీఎండీ, పృథ్వితేజ్ తదితరులు

సీతమ్మధార : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వితేజ్ ఇమ్మడి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో గురువారం జాతీయ ఓటర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు బి.రమేష్ ప్రసాద్, డి.చంద్రం, ఏవీవీ సూర్యప్రతాప్, సీజీఎంలు ఎం.రామకృష్ణ, వి.విజయలలిత, జె.శ్రీనివాసరావు, బి.రామచంద్రప్రసాద్, డి.సుమన్ కల్యాణి, అచ్చిరవికుమార్‌రెడ్డి, పి.శ్రీనివాస్, ఎస్.హరిబాబు, కార్పొరేట్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

తాటిచెట్లపాలెం : ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్స్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలను ఓటు పట్ల అవగాహన కల్పించి, వారిని చైతన్యపరచడమే ఈ ఓటరు దినోత్సవం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అనంతరం అధికారులు, సిబ్బందితో డీఆర్ఎం నిష్పక్షపాతంగా, భయాలకు తావులేకుండా కుల, మత, డబ్బు, సామాజిక వర్గాలకు అతీతంగా తమ ఓటును వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు.

5కేజీల గంజాయి పట్టివేత

మద్రిపాలెం: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఐదో పట్టణ పోలీసుల వివరాలిలా.. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, ఐదో పట్టణ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించగా గురువారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో ఊర్వశి వద్ద తమిళనాడులోని కాంచీపురానికి చెందిన పెరుమాళ్ తియాగు, వి.కార్తీక్, చెంగల్‌పట్‌కు చెందిన గోపాల్ కన్నన్ రఘు అనే ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరించడాన్ని గమనించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 5 కేజీల గంజాయి,రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పాడేరులో గంజాయి కొనుగోలు చేసి తమిళనాడుకు తరలిస్తున్నట్టు విచారణలో వెల్లడైంది.

శ్రీమహాలక్ష్మి దుర్గమ్మవారికి పూజలు

సీతమ్మధార : పౌర్ణమి సందర్భంగా శ్రీమహాలక్ష్మి దుర్గమ్మవారికి గురువారం పంచామృతా భిషేకం, గంధం, పసుపు, పాలు, పెరుగు, తేనెతో పూజలు చేశారు. అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా ముత్యాలమ్మ పరస

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 24 వార్డు గాంధీనగర్‌లోని ముత్యాలమ్మ పరస అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పసుపు,కుంకుమతో పూజలు చేశారు. అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మద్దిలపాలెం, సీతమ్మధార, సీతంపేట, పెదవాల్తేరు, రేసపువానిపాలెం, క్రాంతినగర్, 60 అడుగుల రోడ్డు తదితర ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి దర్శించుకున్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు రమేష్‌రెడ్డి, రవిరెడ్డి, అశోక్‌రెడ్డి, శ్యాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

గైస్‌లో ప్రయోగశాల అభివృద్ధికి విరాళం

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ (గైస్) అభివృద్ధికి తన వంతు సహకారం అందించేందుకు గైస్ పూర్వ విద్యార్థి ముందుకు వచ్చారు. ఈ కాలేజీలో విద్యనభ్యసించిన ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్ విభాగం 2008 సంవత్సరం బ్యాచ్ విద్యార్థి జాజుల నాగేంద్ర కుమార్ గురువారం కాలేజీని సందర్శించారు. ఈమేరకు ప్లాస్టిక్స్ అండ్ పాలిమర్స్ ప్రయోగశాలలో పాలిమర్ టెక్నాలజీ ల్యాబ్ ఏర్పాటుకు ఆయన లక్ష రూపాయల విరాళాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణకు అందించారు. కార్యక్రమంలో కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్ విభాగం హెడ్ ప్రశాంతకుమారి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

పలు చోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం బజార్ (255) సచివాలయం పరిధి రామచంద్రనగర్ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని గురువారం ఏర్పాటు చేశారు. మొత్తం 422 మందికి వైద్య సేవలందించారు. నరసింహనగర్ యూపీహెచ్‌సీ సిబ్బంది, 255సచివాలయ సిబ్బందితో పాటు బాబూరావు, రాజు యాదవ్,నాయుడు, నేపాల్ శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే 42వ వార్డు పరిధి 234 సచివాలయం పరిధి ప్రజలకు రైల్వే న్యూకాలనీ యూపీహెచ్‌సీ వద్ద నిర్వహించిన శిబిరంలో 457 మందికి వైద్య సేవలందించారు.



మందులు కిట్‌ను అందజేస్తున్న కార్పొరేటర్ కంపా హనోకు

బహిరంగ ప్రకటన

[illegible]